

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



**'ఛాప్ తిలక్ సబ్ ఛీనీ రే మోసె నైనా మిలాయ్ కే'**

'మై తులసీ తేరే ఆంగన్‌కీ' సినిమాలో ఒక కీలకమైన సన్నివేశంలో హఠాత్తుగా వస్తుందీ ఖవ్వాలీ ప్రేమగీతం. నిజానికి ఈ పాట సినిమాలో అసందర్భంగా అనిపిస్తుంది. తనను ప్రేమించి మోసం చేస్తాడన్న అనుమానం లేకుండా ఓ పేదింటి పిల్ల ప్లేబాయ్‌లాంటి జమిందారు ప్రేమలో తలమునకలవుతుంది. వారిద్దరూ నది ఒడ్డున కలసినప్పుడు నది ఒడ్డున కొందరు సూఫీలు ఈ ప్రేమగీతం పాడుతూంటారు. దాన్ని తమకు అన్వయించుకుని నృత్యం చేస్తుందా పేదింటిపిల్ల.

తెరపై అసందర్భంగా తోచి అంత ప్రభావం చూపని ఈ పాట ఎంతో ప్రజాదరణ పొందింది. ముఖ్యంగా లతామంగేష్కర్, ఆశాభోంస్లేలు పోటీపడి ఒకరిని మించిన భక్తి ప్రేమావేశాలను మరొకరు ప్రదర్శిస్తూ ఏ మాత్రం లయ రాగం, భావం చెడకుండా 'హైపిచ్' మెట్లను అవలీలగా ఎక్కి దూకుతూ అత్యద్భుతంగా గానం చేసి ఈపాటకొక ప్రత్యేకతను ఆపాదించారు. తన జీవితంలో తాను పాడిన పాటల్లో తనకు నచ్చిన అత్యుత్తమ పది పాటలలో ఒక పాటగా లతా మంగేష్కర్ ఈ పాటను పదే పదే పేర్కొనటం ఈ పాటకు ఆమె ఇచ్చిన ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తుంది.

ఈ పాట కేవలం సినిమా పాటకాదు. ఇది 14వ శతాబ్దానికి చెందిన అమీర్ ఖుస్రో 'బ్రజ భాష'లో రాసిన గజల్ కావటం ఈ పాటకు అత్యంత ప్రాధాన్యాన్ని ఆపాదిస్తుంది. ముఖ్యంగా ఈ పాట భావం ఇటీవలి కాలంలో అత్యంత వివాదానికి గురవటం కూడా. అమీర్ ఖుస్రో రచన గురించి లోతుగా విశ్లేషించాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేస్తుంది.

**అప్నే ఛబ్ బనాయ్‌కే**

**జోమై పీకే పాస్ గయీా**

**జబ్ చబ్ దేఖీ పీహాఓకీ**

## సో మై అప్నీ భోఓల్ గయీా..

ఇది ఒక యువతి తన ప్రియుడిని కలసిన తరువాత తన అస్తిత్వాన్ని, తన వ్యక్తిత్వాన్ని సర్వం మరచి ప్రియుడి ప్రేమలో సంపూర్ణంగా తనని తాను కోల్పోవటాన్ని సూచిస్తుంది. తనదంటూ ప్రత్యేక వ్యక్తిత్వంతో ప్రియుడి దగ్గరకు వెళ్ళిన ఆమె, ప్రియుడిని చూడగానే మైమరచిపోయింది. సర్వం మరచి అతని అస్తిత్వాన్ని తనదిగా చేసుకుంది .అంటే, తన స్వీయ అస్తిత్వాన్ని విడిచి అతని అస్తిత్వాన్ని తనదిగా చేసుకున్నదన్నమాట. ఈ 'సాఖీ ' వింటూంటేనే ఇక్కడ కవి మాములు మానవ ప్రేమ గురించి మాట్లాడటం లేదన్న అనుమానం వస్తుంది.

అమీర్ ఖూస్రో, నిజామ్-ఉద్-దీన్ ఔలియాకు పరమభక్తుడు. ఎంతగా భక్తుడంటే నిజామ్-ఉద్-దీన్ ఔలీయా మరణించిన తరువాత ఆయన విరహవేదనను సహించలేక ఆరునెలలోగా తనూ ప్రాణాలు వదిలాడు. నిజాముద్దీన్ ఔలియా సమాధి సరసనే అమీర్ ఖుస్రో సమాధి ఉంటుంది. ఒక దశలో తాను సుల్తాన్ సేవలో ఉంటూ కూడా సుల్తాన్ అయిష్టాన్ని విస్మరించి మరీ ఔలియాకు సేవలు చేశాడు అమీర్ ఖుస్రో. అతని దృష్టిలో నిజాముద్దీన్ ఔలియా భగవంతుడితో సమానం. ఔలియా పట్ల ఖుస్రో ప్రేమ భక్తుడికి భగవంతుడికి నడుమ ఉన్న ప్రేమ. భగవంతుడి దర్శనం తరువాత వ్యక్తికి తనదంటూ ప్రత్యేక వ్యక్తిత్వం, అస్తిత్వాలు వుండవు. ఆ భావనను ప్రేయసి, ప్రియుల ప్రేమ భావనపై ఆరోపించి చెప్తున్నాడు అమీర్ ఖుస్రో.

'ఈ భావనలో వివాదం ఏముంది?' అనిపిస్తుంది .కానీ వివాదం పాట పల్లవిలోనే ఆరంభమవుతుంది.

## ఛాప్ తిలక్ సబ్ ఛీనీ రే మోసె నైనా మిలాయ్‌కే

స్థూలంగా చూస్తే 'నా కళ్లతో కళ్లు కలిపి నా అస్తిత్వాన్ని లాగేసుకున్నావు ' అంటోంది ప్రేయసి. దీనిలో అభ్యంతర పెట్టేదేమీలేదు. కానీ అమీర్‌ఖుస్రో కాలానికి, ఈ కాలానికీ వచ్చిన ఆలోచనలలో తేడాలు, వాతావరణంలో మార్పుల వల్ల ఇప్పుడు ఈ 'భావన' అపార్థానికి గురవుతోంది దురర్థాలకు తావిస్తోంది.

'తిలక్' అన్న పదానికి అర్థం అందరికీ తెలుసు. నుదుటన ధరించే బొట్టును 'తిలకం' అంటారు. 'ఛాప్ తిలక్' అనటంతో, పూజకు వాడే రుద్రాక్షలు, తిలకం అన్న అర్థాలు వస్తాయి. అంటే కళ్లు కలిపి అతను లాక్కున్నవి రుద్రాక్షలు, నుదుటిపై బొట్టు అన్నమాట. ఇవి హిందూ మహిళల అస్తిత్వానికి సూచనలు. కళ్లు కలిపి, అతను ఆమె అస్తిత్వాన్ని లాక్కున్నాడు.

ఆమె అస్తిత్వానికి చిహ్నాలయిన రుద్రాక్షలను, బొట్టును లాక్కున్నాడు. దాంతో ఆమె తన ప్రత్యేకతను, అస్తిత్వాన్ని కోల్పోయి అతనిలో లీనమైపోయింది. 'లవ్ జిహాద్' అన్న పదం ప్రచారంలో ఉన్న కాలంలో 'ఛాప్ తిలక్ సబ్ చీనీరే మోసే నైనా మిలాయ్ కే' అనగానే అధికులకు అమీర్ ఖుస్రో ప్రేమ భావన ద్వారా 'లవ్‌జిహాద్'ను ప్రదర్శిస్తున్నట్టుగా అర్థం అయింది.

'అమీర్ ఖుస్రో' కాలంలో ఇస్లాం దేశంలో బలంగా వ్రేళ్లూనుకుంటోంది. బయట నుంచి వస్తూన్న ఇస్లామీయులు స్థానిక ఇస్లామీయుల నడుమ ఉద్విగ్నతలు చెలరేగుతున్న కాలం ఇది. ఒక పద్ధతి ప్రకారం మతాంతరీకరణ పెద్ద ఎత్తున సాగుతున్న కాలం అది. అమీర్ ఖుస్రో జీవితం కూడా ఆకాలం నాటి సంఘర్షణలను ప్రతిబింబిస్తుంది. నిజానికి అమీర్ ఖుస్రౌ కాలంలో లవ్ జిహాద్ అవసరంలేదు. ఆకాలంలో ఇస్లామీయుడికి ఒక అమ్మాయి నచ్చితే ఎకత్తుకుపోవటమే తప్ప, ప్రేమ నటించి మోసం చేయాల్సిన అవసరంలేదు.

ఖుస్రో తండ్రి పేరు 'సైఫుద్దీన్ మహమ్మద్' ఆయన ఉజ్బెకిస్తాన్‌లో పెరిగాడు. చెంఘిజ్ ఖాన్ దాడులనుంచి తప్పించుకునేందుకు వీరు ప్రాణాలు అరచేత పట్టుకుని ఢిల్లీ వచ్చారు. ఢిల్లీ సుల్తాన్ 'షమ్సుద్దీన్ ఇల్తుత్‌మిష్' కూడా వీరి జాతికి, ప్రాంతానికి చెందిన వాడు కావటంతో వీరికి ఆశ్రయం ఇచ్చాడు. భూములిచ్చాడు. అలా 'పాటియాలి'లో స్థిరపడ్డాడు సైఫుద్దీన్ మహమ్మద్. అతను బాల్బన్ ఆస్థానంలోని ఓ పెద్ద ఉద్యోగి, ఇటీవలే మతం మారిన 'రావత్ అర్జ్' కూతురు 'బీబీ దౌలత్ నాజ్‌ను' వివాహం ఆడాడు. వారి సంతానం అమీర్ ఖుస్రో అంటే, అతని తల్లి హిందువు. కానీ మతం మారటంతో ఇస్లామ్ మహిళ అయింది. చిన్న తనంలోనే తండ్రిని కోల్పోవటంతో అమీర్ ఖుస్రో అధికంగా 'తాత' వద్ద, తల్లి వద్ద పెరిగాడు. వారు ముస్లిం మతం స్వీకరించినా, అనేక హిందూ పద్ధతులను అనుసరించేవారు. దాంతో అమీర్‌ఖుస్రోకు హిందూ పద్ధతులతో పరిచయం, అభిమానం ఏర్పడింది. ఇస్లామీ పద్ధతులకు ప్రాధాన్యం ఇచ్చినా ఈ పద్ధతుల పట్ల అభిమానం వదలలేదు. ఇది అతని రచనలలో కనిపిస్తుంది. హిందూ పద్ధతులను ఇస్లామీకరణ చేసి, ఇస్లాంకు అన్వయిస్తూ, ఇస్లాం పద్ధతులకు హిందూ పద్ధతులను కలిపి ఇస్లామీకరణ చేసి, ఇస్లాంకు అన్వయిస్తూ, ఇస్లాం పద్ధతులకు హిందూ పద్ధతులతో జత పరుస్తూ 'భక్తి' భావనకు ఆధ్యాత్మకపు రంగులద్ది రెండువైపుల వారికీ అమోదయోగ్యం చేస్తూ, ఆ కాలంలో ఇస్లాం ప్రచారానికి తన రచనల్ను పెద్ద ఎత్తున ఉపయోగించాడు అమీర్ ఖుస్రో. ఈ నేపథ్యంలో చూస్తే 'ఛాప్ తిలక్ సబ్ ఛీనర్ ' అన్న పాదం అర్థం మరోకరంగా తోస్తుంది.

'ఛాప్ తిలక్ ' అంటే మరో అర్థం వస్తుంది .'జబీబా ' అన్న పదం ఉంది.'జబీబా ' అన్నది నిత్యం భగవంతుడి ముందు మోకరిల్లటం వల్ల నుదుటిపై కలిగే మచ్చ. అంటే 'ఛాప్ తిలక్ ' అన్న పదం వాడటం వల్ల 'అమీర్ ఖుస్రో ',

హిందూ, ముస్లింలను సూచిస్తున్నాడు. అంటే నిజాముద్దీన్ ఔలియాతో  కళ్లు కలిపిన వారు, హిందువులయినా, ముస్లింలయినా తమ అస్తిత్వాన్ని కోల్పోతారన్నమాట.  అమీర్ ఖుస్రో ఇలా అనటం వెనక కూడా నాటి రాజకీయాలున్నాయి.

ఆకాలంలో భారతదేశంలో జన్మించిన ముస్లింలకు, బయటనుంచి వచ్చిన వారికి నడుమ ఉద్విగ్నతలుండేవి. ప్రేమ ప్రాతిపదికగా ఇస్లాంను నిర్వచించే 'సూఫీ'లకూ ఇతర ఇస్లామీయలకూ నడుమ ఉద్విగ్నతలుండేవి. అలాగే 'సూఫీ'లలో కూడా  పలువిభిన్నమైన శాఖల నడుమ ఉద్విగ్నతలు చెలరేగుతూండేవి. ఈ అసూయలు, కుట్రలు,  ఆరోపణలు, వివాదాల నడుమ భారతీయులపై పట్టు సాధించాలని ప్రయత్నించేవారు. సుల్తానులు కూడా ఏ సూఫీకి ఎక్కువ ప్రజాదరణ వుంటే ఆ సూఫీని చేరదీసేవారు.

ఔలియాకు ఖిల్జీలతో సత్సంబంధాలుండేవి. సింహాసనం కోసం సోదరుల నడుమ జరిగిన  పోరులో 'ముబారక్‌షా' అధికారం చేపట్టాడు. రాజకీయాలతో సంబంధం లేకపోయినా ఔలియాను తన ప్రత్యర్ధి సమర్ధకుడిగా పరిగణించి ముబారక్ షా నిజాముద్దీన్ ఔలియాను సతాయించాడు. అతనికి వ్యతిరేకంగా 'ఖన్‌ఖ్వా' నిర్మించి సూఫీలంతా అక్కడ ప్రార్ధించాలని నియమం విధించాడు. ఈ రకంగా తమ ప్రమేయంలేకుండానే రాజకీయంగా సామాజికంగా శత్రువులను 'సూఫీ'లు మూట కట్టుకునేవారు. చివరికి నిజాముద్దీన్ ఔలియాతో సత్సంబంధాలు నెరపిన తుగ్లక్ కూడా రాను రాను అభిప్రాయ భేదాలతో నిజాముద్దీన్ ఔలియాను వ్యతిరేకించాడు. అమీర్ ఖుస్రో ఒకవైపు రాజాస్థానంలో ఉంటూ, రాజులను పొగుడుతూ కావ్యాలు రాసేవాడు. మరోవైపు ఆ సుల్తానులు కినుక వహించిన 'సూఫీ'ని దైవంలా పరిగణిస్తూ గీతాలు రచించేవాడు. ఈ నేపథ్యంలో చూస్తే 'ఛాప్ తిలక్ సబ్ ఛీనీరే' మరో కోణంలో అర్ధమవుతుంది.

ఎలాంటివారయినా, హిందువులయినా, సూఫీ వ్యతిరేకులయినా ఇస్లామీయులయినా  నిజాముద్దీన్ ఔలియాను కలిస్తే సర్వం మరచి ఆయన భక్తులయిపోతారన్నమాట. ఇందుకోసం 'ఛాప్ తిలక్ సబ్ ఛీనీరే' అన్న పాదాన్ని వాడేదు అమీర్‌ఖుస్రో.

ఆకాలంలో, ముస్లిం పురుషులు ఇతర మతాల స్త్రీలను వివాహమాడటం ఎవరికీ అభ్యంతరంకాదు. కానీ ముస్లిం మహిళలు ఇతర మతస్తులను వివాహమాడటం మాత్రం నిషిద్ధం. తీవ్రమైన ప్రతిచర్యలుండేవి. అది కూడా ఖుస్రో, 'ఛాప్ తిలక్ ' అన్న ఉపమానాలు అస్తిత్వాన్ని సూచించేందుకు వాడటం వెనుక కారణం అయి ఉండవచ్చు. అమీర్ ఖుస్రో రాసిన మస్నవీలలో  'దువాల్ రాణి – ఖిజ్ర్ ఖాన్' ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇది వాఘేలా రాణి  ఖిజ్ర్ ఖాన్‌ల ప్రేమగాధ.

ఆకాలంలో ప్రేమగాధలన్నీ ముస్లిం పురుషులు, హిందూ స్త్రీల నడుమ ప్రేమ గాధలే. మాల్వా సుల్తాన్ బాజ్ బహదూర్ మందు రాణి రూపమతిల ప్రేమగాధ అహ్మద్ – ఉట్ – ఉమ్రి తుర్కోమన్ రాశాడు. మాలిక్ మహమ్మద్ జయసి అనే సూఫీ కవి రాణి పద్మిని గాధను కావ్యంలా రాశాడు. కాబట్టి తానున్న పరిస్థితులను అనుసరించి అమీర్ ఖుస్రో ' చాప్ తిలక్ సభ్ చీనీ రే' అని కాక మరోరకంగా అనలేడు కూడా. ముస్లిమేతరులేకాక, ముస్లీములు కూడా నిజాముద్దీన్ ఔలియాను చూసి అస్తిత్వం కోల్పోతారు అని అంటే అది వివాదాస్పదమే కాదు, ఆగ్రహావేశాలకూ దారి తీస్తుంది. అందుకని హిందూ ప్రతీకలను స్పష్టంగా, ముస్లీమ్ ప్రతీకలని సూచ్యప్రాయంగా వాడేడు అమీర్ ఖుస్రౌ .

ఈ గీతాన్ని ఇప్పటి కళ్లతో చూసి విశ్లేషించటం భావ్యంకాదు. ఆ కాలంలో ప్రేమద్వారా తమ మతానికి ఆకర్షించటం అన్న పద్ధతిని సూఫీలు ఒక 'కళ' స్థాయికి పెంచారు. తద్వారా 'ప్రేమ' మతం మార్చటంలో ఒక ప్రధాన ఆయుధం అయింది. అమీర్ ఖుస్రో ప్రధానంగా ముస్లిం కవి. సూఫీ. అతని కాలం పరిస్థితులను ఆయన వర్ణించాడు తన రచనలలో. ప్రేమ భావన ప్రచారం కోసం గజల్లు, ఖవ్వాలీలు, స్థానిక భాషలో గీతాలు రాశాడు. తాను కళ్లతో చూసిన చరిత్రను, సుల్తానుల జీవితాలను, గొప్పతనాలను వర్ణించేందుకు పర్షియన్‌ను ఆశ్రయించారు. 'జిజియా పన్ను' చెల్లించిన వారు తమ మతాన్ని అనుసరించవచ్చనే నియమం కనుకలేకపోతే భారతదేశంలో విగ్రహారాధన సమసిపోయేది. కాఫిర్ అన్నవాడు ఉండేవాడు కాదు' అని స్పష్టంగా రాశాడు అమీర్ ఖుస్రో. సోమనాథ దేవాలయ ధ్వంసాన్ని గొప్ప చర్యగా అభివర్ణించాడు. దానికి ఆయన ప్రత్యక్ష సాక్షి. దేవగిరికోటపై దాడికీ ప్రత్యక్ష సాక్షి అమీర్ ఖుస్రౌ. ఈనాడు ఆయనను గంగా జమునా తెహ్జీబ్ కు నిదర్శనంగా నిలపాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా, ప్రధానంగా అమీర్ ఖుస్రౌ, సూఫీ ముస్లీమ్ కవి. రాజాస్థాన కవి. దాన్లో హిందూ–ముస్లీమ్ స్నేహ సౌభ్రాతృత్వ భావనలకు తావులేదు.

కాబట్టి అమీర్ ఖుస్రౌ నాటి స్థలకాల పరిస్థితులను, సామాజిక మనస్తత్వాన్ని విస్మరించి , ఈనాటి కళ్ళతో చూసి , ఇప్పటి పరిస్థితులకు 'ఛాప్ తిలక్‌ను ముడిపెట్టి 'లవ్ జిహాద్' పాట అని 'ఛాప్ తిలక్' పాటను దూషించటం, విమర్శించటం కూడని పని. ఎందుకంటే పాట చరణాలు, సంపూర్ణ భక్తి భావనను, తనను తాను సంపూర్ణంగా సమర్పించుకోవటాన్ని అత్యద్భుతంగా ప్రదర్శిస్తాయి. అమీర్ ఖుస్రో, నిజాం ఉద్దీన్ ఔలియా భక్తిలో ఎంతగా తనని తాను మరచి అస్తిత్వాన్ని విడిచి విలీనమైపోయాడో, ఆ భావనలోని నిజాయితీని చరణాలు స్పష్టం చేస్తాయి.

(ఇది వచ్చేనెల)

Click here to share your comments